
ప్రజాశక్తి
సోమవారం 21 అక్టోబర్ 2024
5
విజయనగరం



## నేడు జిల్లాకు ఉప ముఖ్యమంత్రి రాక

**గుర్లలో డయేరియా బాధితులను పరామర్శించనున్న పవన్**

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్.. ఉపముఖ్యమంత్రి పర్యటన వివరాలు వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి సోమవారం ఉదయం 9:30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 11 గంటలకు నెల్లిమర్ల రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్-ఎస్‌ఆర్ పేట స్టోర్స్ వద్దకు చేరుకుంటారు. అక్కడ స్టోర్స్ తనిఖీ అనంతరం, గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తారు. 11.30 గంటలకు గుర్ల గ్రామానికి చేరుకుని జలజీవన్ మిషన్ పనులను, గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను, తాగునీటి సరఫరా పరిస్థితిని తనిఖీ చేస్తారు. గ్రామస్తులతో ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు గుర్లలో బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటారు. అక్కడ జిల్లా అధికారులతో డయేరియా పరిస్థితిపై సమీక్షిస్తారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

### డయేరియా వ్యాప్తి, మరణాలపై శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



చికిత్స పొందుతున్న రోగిని పరామర్శిస్తున్న బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-గుర్ల

ప్రభుత్వం నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్ల డయేరియా తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు ఆందోళన చెందే పరిస్థితి ఏర్పడిందని శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. ఆదివారం గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులను ఆయన పరామర్శించారు. వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. గుర్ల, పరిసర గ్రామాల్లో గత వారం రోజులుగా డయేరియాతో వరుస మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. ఆదివారం మరో ఇద్దరు డయేరియా బారిన పడ్డారన్నారు.. వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. డయేరియాతో జిల్లాలో 16 మంది మృతి చెందారన్నారు. ప్రభుత్వం లెక్కల ప్రకారం గుర్ల మండలంలో 11 మంది మరణించారని తెలిపారు. ఇవి సహజ మరణాలు కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇంత మంది చనిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో తాను మూడుసార్లు మంత్రిగా చేసినప్పుడు జిల్లాలో ఇటువంటి పరిస్థితి లేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలైందని, గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు సరఫరా బాగోలేకే డయేరియా వ్యాప్తి చెందిందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వదిలి, ప్రజారోగ్యం పట్ల అప్రమత్తమవ్వాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

### హెల్త్ డైరెక్టర్ పర్యటన

హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఎ.శిరి.. ఆదివారం గుర్ల, నాగళ్లవలసలో పర్యటించారు. డయేరియా బారిన పడి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వైద్యం అందుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి నిరంతరం రోగులను గమనిస్తూ తగిన వైద్యం అందించాలని ఆదేశించారు. డయేరియా రోగులను టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున పరామర్శించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

### కేసలి పరామర్శ

**విజయనగరంకోట :** గుర్ల గ్రామంలో డయేరియా బారిన పడి, నగరంలోని ఘోషాసుపత్రి వైద్య సహాయం పొందుతున్న 11 మంది బాలలను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జి.హిమబిందు కలిసి ఆదివారం పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. బాలలు పూర్తిగా కోలుకున్న తర్వాత మాత్రమే డిశ్చార్జి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుజాత, చైల్డ్ లైన్ సిబ్బంది మీనాకుమారి పాల్గొన్నారు.

### ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

ప్రజాశక్తి- విజయనగరం కోట

గుర్లలో డయేరియా వ్యాప్తి, మరణాలపై ప్రతిపక్ష నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డయేరియా రోగులకు వైద్య సేవల్లో హెల్త్ అసిస్టెంట్లను ఏర్పాటు చేయలేదని ప్రతిపక్ష పార్టీ నాయకులు బురదజల్లుతున్నారని చెప్పారు. ఎవరైనా హెల్త్ అసిస్టెంట్లను పెట్టామో? లేదో అనే విషయంలో జిల్లా నాయకులు ఎవరైనా చర్చకు సిద్ధమా? అని సవాల్ చేశారు. భూగర్భజలాల కలుషితం వల్ల డయేరియా వ్యాప్తి చెందిందని, దానికి సూపర్ క్లోరినేషన్ చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల్లో లోటుపాట్లు లేవని స్పష్టంచేశారు. గుర్ల గ్రామంలో డయేరియా వల్ల చనిపోయింది ఒకరు మాత్రమేనని, ఇతర ఇతర కారణాలతో ఏడుగురు మరణించారని తెలిపారు. ప్రతి 20 ఇళ్లకు ఒక ఎఎన్ఎంను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి రిపోర్టర్లు తెప్పించుకొని వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. పిహెచ్‌సిలో బెడ్లు ఉండిపోవడంతో బెంచీలను వాడాల్సి వచ్చిందన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ 2022లో గాజులరేగలో డయేరియా వ్యాప్తి చెందితే, అప్పటి వైసిపి ప్రభుత్వం ఎంతవరకు పట్టించుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, ఎంపిటిసిలు రాజేష్ బాబు, వి.శ్రీనివాసరావు, బంగారుబాబు పాల్గొన్నారు.



సరస్ ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### ఏటా నాలుగు చోట్ల

# డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శనలు

- అమరావతిలో పది ఎకరాల్లో ప్రదర్శన కేంద్రం
- సరస్ ముగింపు కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులు, హస్తకళాకృతులు ఏడాది పొడవునా మార్కెటింగ్ చేసుకొనేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లను సెర్ప్ ద్వారా చేస్తున్నట్టు రాష్ట్ర సెర్ప్, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం రాష్ట్రంలో ప్రతి ఏటా నాలుగు చోట్ల అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. దీంతోపాటు అమరావతిలో పది ఎకరాల్లో శాశ్వత స్థాయిలో డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకం, ప్రదర్శన కోసం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు తగిన స్థలం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరామని, సిఎం అందుకు అంగీకరించారని వెల్లడించారు. అఖిల భారత డ్వాక్రా బజార్-2024 (సరస్) ముగింపు సందర్భంగా స్థానిక లోయర్ ట్యాంక్‌బండ్ రోడ్డులోని సరస్ ప్రాంగణం వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. జిల్లాలోని మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులకు ఇతర ప్రాంతాల్లో తయారయ్యే విభిన్న ఉత్పత్తుల గురించి తెలుసుకొని, కొనుగోలు చేసే గొప్ప అవకాశాన్ని ఈ ప్రదర్శన కల్పిస్తుందని చెప్పారు. పది రోజుల ప్రదర్శనలో రూ.7.20 కోట్ల విలువైన ఉత్పత్తుల విక్రయాలు జరగడం గొప్ప విషయమన్నారు. ఇంటికో ఔత్సాహిక పారిశ్రామిక వేత్త తయారు కావాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి చెప్పారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఏటా ఈ తరహా ప్రదర్శనలు నిర్వహించేందుకు మంత్రి చొరవ చూపాలని కోరారు. డ్వాక్రా మహిళలు రూపొందించిన చేతి ఉత్పత్తులు, వస్త్రాలు, హస్తకళాకృతులు వంటి వాటిని కొనుగోలు చేయడం ద్వారా మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు.

డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కూడా పాల్గొన్నారు. ఈ ప్రదర్శన నిర్వహణకు ఆర్థిక సహకారం అందించిన నాబార్డు డిజిఎం నాగార్జున, ఎల్‌డిఎం రమణమూర్తి, డిసిసిబి సిఇఒ ఉమామహేశ్వరరావు, స్త్రీనిధి ఎజిఎం ఉమామహేశ్వరరావు, ఆప్కాబ్ ఎజిఎం పవన్, ఇతర బ్యాంకుల అధికారులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్, ఎమ్మెల్యేలు జ్ఞాపికలు అందించి సత్కరించారు. ప్రదర్శన నిర్వహణలో సహకరించిన ప్రభుత్వ శాఖల అధికారులకు జ్ఞాపికలు అందజేశారు.

# నగరాన్ని సమగ్రాభివృద్ధి చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని డిమాండ్
- ఉత్సాహంగా సాగిన సిపిఎం నగర మహాసభ
- ఆకట్టుకున్న ప్రదర్శన





మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ; కోలాటం ఆడుతున్న చిన్నారులు, మహిళలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరాన్ని సమగ్రాభివృద్ధి చేయాలని, అందుకోసం సిపిఎం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ స్పష్టంచేశారు. ఆదివారం సిపిఎం నగర మూడో మహాసభ ఉత్సాహ పూరిత వాతావరణంలో సాగింది. కలెక్టరేట్ నుంచి డప్పు వాయిద్యాలతో, కోలాటంతో ప్రారంభమైన ర్యాలీ.. ఎన్‌పిఆర్ భవనం వరకు సాగింది. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో తమ్మినేని మాట్లాడారు. విజయనగరం కార్పొరేషన్‌గా మార్పు చెందినా, అందుకు అనుగుణంగా అభివృద్ధి చేయలేదన్నారు. పాలకులు మారినా విధానాలు మారలేదని చెప్పారు. నగరంలో పరిస్థితులు చూస్తుంటే, మున్సిపల్ కార్మికులు తగినంత మంది లేరన్నారు. మురికివాడలు మరింత అధ్వానంగా తయారవుతున్నాయని చెప్పారు. పేదలకు అవసరమైన రూ.200 కుళాయిలు ఇవ్వడం లేదన్నారు. పేదలు నివాసముండే ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, కనీస మౌలిక సదుపాయాలు లేవని చెప్పారు. జ్యూట్ మిల్లులు మూతపడి వేలాది మంది రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్తగా పరిశ్రమలు రాలేదన్నారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదల బతుకులు ఛిద్రమవుతున్నాయని తెలిపారు. ఎక్కడా కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ విధానాలు, ఇసుక దొరక్క పోవడంతో భవన నిర్మాణ రంగం దెబ్బతిందని చెప్పారు. జనాభా పెరుగుతున్నా మున్సిపల్ పాఠశాలలు, వసతిగృహాలు పెరగడం లేదని, ప్రభుత్వ డిగ్రీ కాలేజికి సొంత భవనం లేదని ఆక్షేపించారు. టిడ్కో ఇళ్లు కట్టినా అప్పగించలేదని, జగనన్న కాలనీలు పూర్తి కాలేదని, హుదూద్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా, వాటిని రక్షించే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. ఇలా అభివృద్ధికి దూరంగా ఉన్న విజయనగరం సమగ్రాభివృద్ధికి తగినన్ని నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే కాలంలో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యదర్శి నివేదికను నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, ఎ.జగన్ మోహన్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.రమణ, వి.రామచంద్రరావు, వి.లక్ష్మి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన చదరంగం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫైర్ చెస్ స్కూల్, శ్రీ చెస్ అసోసియేషన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్య ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న ఎపి అండర్-9 ఓపెన్ అండ్ గర్ల్ చెస్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు ఆదివారం ముగిశాయి. ఓపెన్ విభాగంలో విజేతగా సిహెచ్.ధాన్విన్ రామ్ (కాకినాడ), రన్నర్‌గా ఎం.శ్రీసాకేత్ (అనంతపూర్) నిలిచారు. బాలికల విభాగంలో విజేతగా వి.మోదితా రెడ్డి (తిరుపతి), రన్నర్‌గా సిహెచ్.అనన్య (తూర్పుగోదావరి) నిలిచారు. విజేతలు డిసెంబర్‌లో పూణేలో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారు. ఈ పోటీలు ఆంధ్రా చెస్ అసోసియేషన్ సిఇఒ జ్వాలా ముఖి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రా చెస్ అసోసియేషన్ కోశాధికారి కె.కె.జగన్నాథ, ఎన్.ఉమామహేశ్వరరావు, విజయనగరం చెస్ అసోసియేషన్ సభ్యులు మూడడ్ల గణేష్ నాయుడు, కె.ధనలక్ష్మి, టి.అర్చన, ఎ.దామోదరరావు, కె.సురేష్ పాల్గొన్నారు.




విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

# జిఒ 117ను రద్దు చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిఒ 117ను రద్దు చేసి, పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని కెఎల్‌పురంలో శేషగిరి విజ్ఞాన కేంద్రం సెల్లార్‌లో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు జెఆర్‌సి పట్నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శత శాతం ఓట్లు నమోదు చేయించాలన్నారు. పాఠశాలల్లో బోధనేతర పనులు రద్దు చేసి, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చెయ్యాలని డిమాండ్‌చేశారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పుడు సెల్ఫ్ టెస్ట్ నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని, సిలబస్ పూర్తయ్యాక ఆ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జనవరి 5, 6, 7, 8 తేదీల్లో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను కాకినాడలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### యుటిఎఫ్ పిలుపు

నవంబర్ 17, 18 తేదీల్లో విజయనగరంలో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, జిల్లాలో ఉపాధ్యాయులు అందరూ హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, జి.పార్వతి కోశాధికారి సిహెచ్ భాస్కర్‌రావు మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ కె.అప్పారావు, జిల్లా కార్యదర్శులు పక్కి వాసు, కె.ప్రసాదరావు, పి.వాసుదేవరావు, ఎన్.సత్యనారాయణ, సిహెచ్ తిరుపతినాయుడు, జి.రాజారావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.శంకరరావు, సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అమరుల సేవలు మరువలేనివి

### 21 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు : ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

విధి నిర్వహణలో మరణించిన పోలీసు అమరుల సేవలు మరువలేనివని ఎస్‌పి వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వారి త్యాగాలను స్మరించుకొంటూ సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. అదే విధంగా ఈ నెల 21 నుంచి 31 వరకు పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లుగా వెల్లడించారు. 21న స్మృతివనంలో పోలీసు అమర వీరులకు నివాళులర్పించి, స్మృతి పరేడ్ నిర్వహించి, ర్యాలీ చేపడతామని చెప్పారు. 21 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ సినిమా థియేటర్లలో పోలీసు ఖ్యాతిని రెట్టింపు చేసేలా గుర్తింపు పొందిన సినిమాలను, వీడియో క్లిప్స్‌ను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పోలీసుశాఖలో పని చేస్తూ, విధి నిర్వహణలో మరణించిన పోలీసు అమరవీరుల స్వస్థలాలను, వారు చదువుకున్న పాఠశాలలను పోలీసు అధికారులు, సిబ్బంది సందర్శించి, పోలీసుశాఖకు వారు అందించిన సేవలను వివరిస్తామని చెప్పారు. అక్టోబరు 26, 27వ తేదీల్లో జిల్లా కేంద్రం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. 24 నుండి 27 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో, జిల్లా కేంద్రంలో 'రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివిన్షన్ ఆఫ్ సైబరు క్రైమ్' అన్న అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. 28న పోలీసు కార్యాలయ ప్రాంగణంలో మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామని వివరించారు. 29న విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్‌డివిజన్ల పరిధిలోని కళాశాలలు, పాఠశాలల్లో పోలీసుల త్యాగాలు అనే అంశంపై సెమినార్లు నిర్వహించనున్నారని తెలిపారు. 30న జిల్లా కేంద్రంలో ప్రజల్లో జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు యూనిటీ రన్ నిర్వహిస్తామని చెప్పారు.

# తగ్గిన మద్యం ధరలు

- త్వరలోనే పట్టిక విడుదల
- అందుబాటులోకి పాత బ్రాండ్లు
- రూ.4 కోట్ల విలువైన పాత సరుకు నిల్వ
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 205 దుకాణాలు లైసెన్సులు
- నిబంధనలు పాటించకపోతే పర్మినెంట్ లైసెన్సు ఇచ్చేది లేదు
- 'ప్రజాశక్తి'తో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ముఖాముఖి



ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

ఎక్సైజ్ నూతన విధానంలో భాగంగా మద్యం ధరలు తగ్గాయని, త్వరలోనే దీనిపై స్పష్టమైన పట్టిక విడుదల అయ్యే అవకాశం కూడా ఉందని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు తెలిపారు. నూతన పాలసీ అమల్లోకి వచ్చిన (అక్టోబర్ 14) నాటికి ఉమ్మడి విజయనగరం జిల్లాలో 21 వేల కేసుల మద్యం నిల్వ ఉందని తెలిపారు. దీన్ని ఎపి బేవరేజెస్ గోడౌన్‌కు తరలించి, ఆడిట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. దీని విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుందని వివరించారు. ఉమ్మడి జిల్లాలో 205 దుకాణాలు ఇప్పటికే ఏర్పాటు అయ్యాయని, వాటికి తాత్కాలిక లైసెన్సులు కూడా జారీచేశామని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు....

**జిల్లాలో ఎన్ని దుకాణాలు ఏర్పాటయ్యాయి.?**


ఉమ్మడి విజయనగరం జిల్లాలో 205 మద్యం దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో విజయనగరం జిల్లాలో 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 ఉన్నాయి. వీటన్నింటికీ ఈ నెల 14న నిర్వహించిన లాటరీ ద్వారా అవకాశం పొందిన వారంతా దుకాణాలు ఏర్పాటుచేశారు. వీరంతా ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అందుకే ప్రస్తుతం తాత్కాలిక అనుమతులు జారీచేశాం. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేస్తే రెండేళ్ల కాలపరిమితికి అనుగుణంగా లైసెన్సు ఇచ్చేది లేదు. వారం రోజుల్లో ఈ తరహా లైసెన్సు పొందాల్సి ఉంటుంది.

**దుకాణాల ఏర్పాటుకు నిబంధనలు ఏమిటి.?**

మద్యం షాపుల ఏర్పాటుకు స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. జాతీయ రహదారికి 500 మీటర్ల దూరం పాటించాలి. ఒకవేళ ఈ తరహా రహదారికి అనుకుని 2500 జనాభా దాటి ఉన్న పంచాయతీల్లో అయితే 250 మీటర్ల దూరం సరిపోతుంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఈ నిబంధనల మినహాయింపు ఉంటుంది. జిల్లా ప్రధాన రహదారుల్లో ప్రభుత్వం గుర్తించిన బ్లాకుల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడపడితే అక్కడ పెట్టేయడానికి వీలు లేదు.

**నూతన పాలసీ ప్రకారం మద్యం ధరలు తగ్గాయా.?**

అవును! మద్యం ధరలు తగ్గాయి. ముఖ్యంగా రూ.120 నుంచి రూ.150 వరకు ఉన్న ఛీప్ లిక్కర్ రూ.30 నుంచి రూ.40 వరకు ధర తగ్గింది. ఈ కేటగిరీలోని మూడు రకాల మద్యం రూ.99కే అందుబాటులోకి వస్తుంది. ప్రీమియం బ్రాండ్లకు సంబంధించి కూడా ధర తగ్గుతుంది. అయితే వీటిపై ఎంత మేర తగ్గుతుందనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. త్వరలోనే ప్రభుత్వం నుంచి ధరల పట్టిక వచ్చే అవకాశం ఉంది. సాధారణ జనం ఉపయోగించే మద్యంపై ఎక్కువ శాతం తగ్గుదల ఉంటుందనడంలో సందేహం లేదు.




**ప్రభుత్వం చెప్పినట్టు పాత బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయా.?**

ఇప్పటికే సిగ్నేచర్, రాయల్ స్టాగ్, బ్లెండర్ స్ప్రైడ్, ఆఫీసర్ ఛాయిస్, 8 పిఎం తదితర కొత్త బ్రాండ్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. గత ప్రభుత్వంలోని పాత సరుకు కూడా కొంతమేర నిల్వ ఉంది. ప్రస్తుతం నేటి ప్రభుత్వంలోని పాత బ్రాండ్లు, గత ప్రభుత్వంలోని పాత నిల్వలు అందుబాటులో ఉన్నాయి. వ్యాపారుల అర్డర్ ప్రకారం గోడౌన్ నుంచి దుకాణాలకు సరుకు పంపుతున్నాం.

**ప్రస్తుతం జిల్లాలో పాత సరుకు ఎంత మేర నిల్వ ఉంది.?**

కేసులో 9 లీటర్ల మద్యం ఉంటుంది. ఇలా ఉమ్మడి విజయనగరం జిల్లాలో 21 వేల కేసుల మద్యం నిల్వ ఉంది. దీని విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుంది. ఇది ఈ రెండు జిల్లాలకు పది రోజులపాటు సరిపోతుంది. నాలుగు రోజుల క్రితం వరకు ప్రభుత్వ దుకాణాల్లో ఉన్న ఈ స్టాక్‌ను నూతన విధానం అమల్లోకి రావడం వల్ల నెల్లిమర్లలోని గోడౌన్‌కు తరలించాం. ప్రస్తుతం ఆడిట్ జరుగుతోంది. ప్రస్తుతం పాత సరుకుతోపాటు పాత బ్రాండ్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

**దుకాణాల ఏర్పాటులో వ్యాపారులంతా నిబంధనలు పాటించారా.?**

ఒకటీ అరా లోపాలు ఉంటే ఉండవచ్చు. కానీ, తాత్కాలిక లైసెన్సు పొందిన 7 రోజుల్లోపు వారంతా రెండేళ్ల కాలపరిమితికి లైసెన్సు పొందవచ్చు. నిబంధనలు పాటించని వ్యాపారులకు పర్మినెంట్ లైసెన్సు జారీచేసే ప్రసక్తే లేదు. ఇందులో పారదర్శకత పాటిస్తాం. రాజకీయ సిఫార్సులు వచ్చినా వెనక్కి తగ్గేది లేదు.

**నాటుసారా తయారీపై మీ చర్యలు ఎలా ఉంటాయి.?**

నాటు సారా తయారీ మాత్రమే కాదు.., గంజాయి రవాణా, క్రయ, విక్రయాలపై కూడా దృష్టిపెడుతున్నాం. ప్రభుత్వ తొలి ప్రాధాన్యత కూడా వీటి నివారణే. అవసరమైన చోట ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసుల సహకారం కూడా తీసుకుంటాం.



చిన్నారికి, తల్లిదండ్రులకు ప్రశంస పత్రాన్ని అందిస్తున్న మంత్రి సంధ్యారాణి

## ఐదు నెలల చిన్నారికి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు

**ప్రజాశక్తి - బొబ్బిలి**

మండలంలోని కొత్తపెంట గ్రామానికి చెందిన ఐదు నెలల చిన్నారి సిరికి ధన్షిక తన ప్రతిభతో నోబెల్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకొని అందరిచే ఔరా అనిపించుకుంది. 120 ఫ్లాష్ కార్డులను గుర్తించి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది. గ్రామానికి చెందిన సిరికి లక్ష్మణనాయుడు, హారిక దంపతుల కుమార్తె ధన్షికకు రెండు నెలల వయస్సు నుంచి తల్లిదండ్రులు వివిధ వస్తువులు, బొమ్మలు చూపించి గుర్తుపట్టేలా అవగాహన కల్పించారు. ఇలా 120 రకాల విభిన్న ఫ్లాష్ కార్డులు (జంతువులు, పక్షులు, కూరగాయలు, పండ్లు, రంగులు వివిధ దేశాల జెండాలు) గుర్తు పడుతున్న వీడియో రికార్డులను నొబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థకు పంపించగా వారు రికార్డుకు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు ప్రశంసపత్రం, మెడల్స్ ను ధన్షిక తల్లిదండ్రులకు పంపించారు. ఈమేరకు ఆదివారం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చిన్నారి దన్షిక మెడలో మెడల్ వేసి అభినందించారు.



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న సొసైటీ సభ్యులు

## రూ.10 వేలు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - కొత్తవలస**

మండలంలోని కొత్తవలస గ్రామం జిఎస్ఎన్ రాజు నగర్‌కి చెందిన ముక్కవల్లి సురేష్ కుమార్ భార్య ముక్కవల్లి నాగమణి అనారోగ్యంతో మంచానికే పరిమిత మవడంతో ఆమెకు రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు. జాయినింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ నిమ్మలపాలెం తమ సొసైటీ ద్వారా ఆదివారం ఆ నగదును అందించారు. మందులు ఖర్చులు నిమిత్తం ఈ సాయం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు గొంప రాంబాబు, సభ్యులు చీపురుపల్లి సాగర్ కళ్యాణ్, సిరిమల్లి పైడిరాజు, ఈ సమస్య తెలియజేసిన టిడిపి నాయకులు గొంప దుర్గా ఉమేష్, పోట్నూరు వెంకట రత్నాజీ, గొంప పోతు నాయుడు, పప్పు అప్పలరాజు, పొన్నగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## పేకాట శిబిరంపై దాడి

**ప్రజాశక్తి - నెల్లిమర్ల**

పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నగదు, నిందితులను పట్టుకున్నారు. ఆదివారం ఎస్ఐ బి. గణేష్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ టిక్కో కాలని వద్ద 6గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడిలో రూ.5,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



పిచికారీ పనులను పరిశీలిస్తున్న వైస్ సర్పంచ్ రమణమూర్తి

## పాటూరులో దోమల నివారణకు పిచికారి

**ప్రజాశక్తి - వేపాడ**

మండలంలోని పాటూరు గ్రామంలో దోమల నివారణకు ఎసిఎం ద్రావణాన్ని ఇంటింటికీ పిచికారీ చేయిస్తున్నామని గ్రామ సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ మేరకు వైస్ సర్పంచ్ కొట్యాడ రమణమూర్తి పర్యవేక్షణలో ప్రతి ఇంటిలో ఏ మేరకు దోమల మందు పిచికారీ చేస్తున్నారు, స్ప్రే చేస్తున్న తీరు, వినియోగించిన ఎసిఎం ద్రావణం మోతాదును స్వయంగా పరిశీలించారు. గ్రామంలో ఉన్న ఇళ్లన్నింటికీ స్ప్రేయింగ్ పూర్తి చేయాలని ఆయన చెప్పారు. పిచికారీ జరిగినట్లుగా సూచించే మార్కింగ్‌ను తప్పనిసరిగా ఇంటికి వేయాలన్నారు. ప్రజలు సహకరించి వినియోగించుకోవాలని, తద్వారా దోమల వ్యాప్తి తగ్గి జ్వరాలు ప్రబలకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముమ్మన అప్పలనాయుడు, వెంకటరమణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పోటీలకు పయనమైన క్రీడాకారులు

## రాష్ట్ర పోటీలకు పయనమైన వాలీబాల్ జట్లు

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

హిందూపూర్‌లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే అండర్-17 బాల, బాలికల వాలీబాల్ పోటీలకు జిల్లా జట్లు ఆదివారం పయనమయ్యాయి. స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్లు అనేకమార్లు విజేతగా నిలిచాయని ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. అదే ఒరవడిని కొనసాగించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలని ఆకాక్షించారు. క్రీడాకారులకు జిల్లా వాలీబాల్ అసోషియేషన్ కార్యదర్శి కెవిఎన్ రాజు అభినందనలు తెలిపారు.

## కిరణ్‌కు లెఫ్టినెంట్ ర్యాంకు

**ప్రజాశక్తి-విజయనగరం**

సత్య డిగ్రీ, పిజి కళాశాల అధ్యాపకులు ముమ్మిడిశెట్టి ఉదయ కిరణ్ లెఫ్టినెంట్ ర్యాంకు పొందారు. ఉదయ కిరణ్ ప్రీ-కమిషన్ (పిఆర్‌సిఎన్) ఎన్‌సిసి కోర్సును విజయవంతంగా పూర్తి చేయడంతో ఆయనకు లెఫ్టినెంట్ ర్యాంకు ఇచ్చారు. మహారాష్ట్రలోని కంపీలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ఆయన 85 రోజుల కఠిన శిక్షణ పొందారు. కిరణ్‌ను కళాశాల డైరెక్టర్ మజ్జి శశి భూషణ్, కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎన్‌సిసి అధికారి సూరపునాయుడు అభినందించారు.




కిరణ్‌ను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణ్, సత్యవేణి, సూరపునాయుడు

# గ్రామాల్లో సదుపాయాల కల్పనే ధ్యేయం

**ప్రజాశక్తి - నెల్లిమర్ల**

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఎపి మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. ఆదివారం మండలంలోని గరికిపేట, పూతికపేట, కొండగుంపాం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 'కాలువలు, రోడ్లను ప్రజలందరూ శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త కాలువలో వేస్తే అది పేరుకుపోయి అనేక రోగాలు వస్తాయని చెప్పారు. గ్రామాలలో ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పార్టీలకు అతీతంగా అందరూ కలిసి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, బిజెపి నాయకులు బుర్లే శ్రీధర్, టిడిపి నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పల నాయుడు, గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనా రాయణ, అధికారులు పాల్గొన్నారు.

**బొబ్బిలి రూరల్:** మండలంలోని పల్లె పండగ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర నాయకులు అల్లాడ బాస్కారావు మాట్లాడుతూ



బొబ్బిలి రూరల్: శంకుస్థాపనలో పాల్గొన్న టిడిపి నాయకులు, అధికారులు



నెల్లిమర్ల: భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు

పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో ఎంపిడిఒ రవికుమార్, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, సర్పంచ్, ఎంపిటిసి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

**డెంకాడ:** కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పల్లె పండగలో భాగంగా మండలంలోని బొ డ్డవలస గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, నాయకులు కంది సూర్యనారాయణ, ఎంపిడిఒ భవాని, జనసేన నాయకులు పైల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**శృంగవరపుకోట:** పల్లె పండగ కార్యక్రమం ద్వారా మండలంలోని పంచాయతీలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆదివారం శంకుస్థాపనలు చేశారు. పల్లె పండగ - పంచాయతీ వారోత్సవ కార్యక్రమం ద్వారా గ్రామాలకు మహర్దశ చేకూరుతుందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాయిరాం కాలనీలో రూ.17 లక్షలతో, తిమిడి గ్రామంలో రూ.15 లక్షలతో, వెంకటరమణపేట గ్రామంలో రూ.25లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ ఇతర పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, ఎస్.కోట సర్పంచ్ గనివాడ సంతోసి కుమారి, నాయకులు జిఎస్ నాయుడు, కరెడ్ల ఈశ్వరరావు, రెడ్డి వెంకన్న, వబ్బిన సన్యాసినాయుడు, మజ్జి దేవి, వాకాడ సింహాచలం, కనిశెట్టి ఈశ్వరరావు, దొరబాబు, కాపుగంటి వాసు, చక్కా కిరణ్ కుమార్, అనకాపల్లి చెల్లయ్య, మల్లేశ్వరరావు, పొట్నూరు సాయిరాం, కన్నతల్లి, ఎంపిడిఒ సతీష్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

## సమ్మె ఒప్పందాలు వెంటనే అమలు చేయాలి

**ప్రజాశక్తి- రాజాం**

అంగన్వాడీలకు గత ప్రభుత్వం చేసిన సమ్మె ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి అన్నారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమామహేశ్వరీ మాట్లాడుతూ గత సంవత్సరం 42 రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి పైగా అంగన్వాడీలు సమ్మె చేశారన్నారు. ఈ సందర్భంగా ఐదు జీవోలు ఇస్తూ జులైలో జీతాలు పెంచుతామని మిగిలిన జీవోలు అమలు చేస్తామని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. టిడిపి ప్రభుత్వం వచ్చి వంద రోజులు అయినా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తుందని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జీతాలు పెంచాలని గ్రాడ్యుయేట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యాప్‌లు మోత తీవ్రంగా ఉందని అన్ని యాప్‌లను కలిపి ఒక్క యాప్‌గా మార్చాలిని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్రను తిప్పి కొడతామని హెచ్చరించారు. అనంతరం రాజాం ప్రాజెక్ట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి. ఉమా, కార్యదర్శిగా సిహెచ్. రూప, ట్రెజరర్‌గా ఎల్. జయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో అంగన్వాడి యూనియన్ గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, అధ్యక్షులు బి. పైడ్రాజు, ప్రధాన కార్యదర్శి అనసూర్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు, రాజాం సిఐటియు నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు ఎం.ఉమామహేశ్వరి

## సంకల్పం బోర్డులు ఏర్పాటు

**ప్రజాశక్తి- డెంకాడ**

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై సంకల్పం బోర్డులను ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు ఆదివారం మండలంలో పలుచోట్ల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రతి ఒక్కరూ సంకల్పం చేయాలని కోరారు. మండలంలో ప్రతి గ్రామంలో సంకల్పం బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం మండలంలోని జొన్నాడ లెండి ఇంజనీరింగ్ కళాశాల, చింతలవలస మహారాజ్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కోసం ఈ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించే వ్యక్తి కాకుండా కుటుంబం మొత్తం నాశనం అవుతుందని భవిష్యత్తు నాశనం చేసుకోకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సంకల్పంతో ప్రతిజ్ఞ చేసి జీవితాన్ని కాపాడుకోవాలన్నారు. గంజాయి మాదక ద్రవ్యాలను వాడినా, వినియోగించినా, అమ్మినా కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




బోర్డులను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

## ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి

**ప్రజాశక్తి- బొబ్బిలి**

వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు సీనియర్ నాయకులు, జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు పిలుపు నిచ్చారు. ఆదివారం సాయంత్రం ఎపిటిఎఫ్ కార్యాలయంలో 10 మండలాల జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అర్హత కలిగిన ప్రతి ఓటర్‌నూ నమోదు చేయించాలన్నారు. వచ్చే నెల 6వ తేదీ వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిద మండలాల కార్యకర్తలు, జిల్లా కార్యదర్శి సింహాచలం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు ఎల్లయ్య, మోహన్ రావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, పరిసి నాయుడు, లక్ష్మణ రావు, సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్‌లు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజు

## రాజాపులోవ వద్ద ట్రాఫిక్ కష్టాలు

**ప్రజాశక్తి - భోగాపురం**

విజయనగరం నుంచి విశాఖ వెళ్లే రహదారిలో రాజాపులోవ వద్ద ట్రాఫిక్ కష్టాలతో వాహనదారులు గత కొన్ని రోజుల నుంచి తీవ్ర బ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో వర్షం గట్టిగా కురిస్తే వర్షపు నీరు రహదారిపై నుంచే ప్రవహించడంతో వాహనదారులు భయపడుతూ వెళ్తున్నారు. దీంతో ఎదటి నుంచి వచ్చే వాహనాలు తప్పించుకునే క్రమంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ సమస్య గత కొన్ని రోజుల నుంచి ఉన్నప్పటికీ ఇటు హైవే అధికారులు, పోలీసులు అటు రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ముఖ్యంగా ఈ రహదారిని ఆనుకొని ఉన్న చెరువు నిండిపోవడంతో వర్షాలు పడితే అదనంగా వచ్చే నీరు ఎటూ వెళ్లేందుకు అవకాశం లేక రహదారి పైనుంచి పొంగి ప్రవహిస్తుంది. ఈ నీటిని అధికారులు మళ్లించే ప్రయత్నం చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చిన్న వర్షం పడినా రహదారి పై నుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు నీటిపై నుంచి వెళ్లేందుకు ఆందోళన చెందుతున్నారు. ఇంత ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న కనీసం పోలీసులు కూడా పట్టించుకోవడంలేదని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిలో నుంచి వెళుతున్న ప్రయాణికులు

## సత్యనారాయణ వైద్య సేవలు మరువలేనివి

**ప్రజాశక్తి- నెల్లిమర్ల**

గ్రామీణ వైద్యులుగా గుర్తింపు పొందిన బెల్లాన సత్యనారాయణ సేవలు మరువలేనివని జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని గరికిపేట గ్రామంలో ఆదివారం గ్రామీణ వైద్యులు డాక్టర్ బెల్లాన సత్యనారాయణ పెద్దకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొండగుంపాం, గరికిపేట గ్రామాల్లో ప్రజలకు తక్కువ రుసుముతో నాణ్యమైన వైద్యాన్ని అందించిన సత్యనారాయణ మన మధ్య లేకపోవడం ఈ రెండు గ్రామాలకు తీరని లోటన్నారు. వైద్యంతో పాటు సామాజిక కార్యక్రమాలు, బడి, గుడి నిర్మాణాలకు ఆయన చేసిన ఆర్థిక సాయం ప్రజలు మరువలేరన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, వైసిపి నాయకులు అంబళ్ల శ్రీరాములునాయుడు, సముద్రపు రామారావు, గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, టిడిపి నాయకులు బెల్లాన అచ్చుంనాయుడు, బంగారునాయుడు, ఈశ్వరరావు, రమణ, వైసిపి నాయకులు ఉమ, రాజబాబు, బెల్లాన రమణ పాల్గొన్నారు.



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్**

మండలంలోని పలువురు భాధితుల్ని ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం పరామర్శించారు. ఇటీవల మెట్టవలస గ్రామానికి చెందిన ఫ్లైఓవర్ పై యాక్సిడెంట్‌కు గురైన కర్రి సత్యనారాయణ కుటుంబాన్ని, అదే ప్రమాదంలో మరణించిన అరసాడ విశాల్ తల్లిదండ్రులను పరామర్శించారు. టిడిపి సీనియర్ నాయకులు కెల్ల గురునాయుడు ఈ మధ్యనే మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని వారి కుటుంబాన్ని, గుండెపోటుతో మృతి చెందిన కోలా రాము కుటుంబాన్ని, బొబ్బిలి పట్టణం గొల్లపల్లికి చెందిన పైల లక్ష్మీ నారాయణ తల్లి మరణించిందని ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవ, పిరిడి ఈశ్వరరావు, పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

**హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే**

మండలంలోని దిబ్బగుడ్డివలస హెల్త్ సబ్ సెంటర్‌ని ఎమ్మెల్యే బేబినాయన సందర్శించారు. సబ్ సెంటర్ శిథిలావస్థకు చేరిందని స్థానిక టిడిపి నాయకులు వాసిరెడ్డి సత్యనారాయణ, ఎంపిటిసి నాగరాజు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మౌలిక వసతులు, మరమ్మత్తులు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వంశీ, టిడిపి నాయకులు అల్లాడ భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ, ఎంపిటిసి వి.నాగరాజు పాల్గొన్నారు.

## డెయిరీ డైరెక్టర్ మృతి

**ప్రజాశక్తి-బొబ్బిలి**

విశాఖ డెయిరీ డైరెక్టర్ శంబంగి అమ్మలు (87) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నయ్య శ్రీరాములునాయుడు సతీమణి అమ్మలు రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురికావడంతో విశాఖ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించారు. అమ్మలు భర్త శ్రీరాములునాయుడు ఐదేళ్ల క్రితం మరణించారు. అమ్మలు కుమారుడు సుగుణాకరరావు జలవనరుల శాఖ నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. అమ్మలు మరణంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. పక్కీలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## మద్యాన్ని నియంత్రించాలి

**బొబ్బిలి:** మద్యాన్ని నియంత్రించాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ఒక ప్రకటనలో కోరారు. వైసిపి హయాంలో మద్యం నియంత్రణలో ఉండేదని, కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యాపారులకు మద్యం షాపులు అప్పగించడంతో నియంత్రణ సాధ్యం కాదన్నారు. మద్యం బాటిల్ రూ.99కే ఇచ్చి నిత్యావసర సరుకుల ధరలను పెంచడం దుర్మార్గమన్నారు. మద్యాన్ని నియంత్రి ంచాలని కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతి భద్రతలు అదుపులో లేవన్నారు. ప్రతిపక్ష నాయకులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

## తుపాను పట్ల అప్రమత్తం

**పార్వతీపురం:** తుఫాను పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. వాతావరణ శాఖ సూచనలు మేరకు ఈనెల 23 నుండి 26 వరకు తుపాను కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా, మండల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, వరదల పరిస్థితిని గమనించాలని తెలిపారు. వసతి గృహాలను తనిఖీ చేయాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరూ ఉండరాదని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు యిబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని ఆయన తెలిపారు. అటువంటి ప్రదేశాల్లో సిబ్బందిని ఏర్పాటు చేయడం, సూచనల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. విపత్తులు సంభవించే అవాశాలు ఉన్న ప్రదేశాలు వద్ద పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. విపత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. గెడ్డలు, వాగులు, వంకలు పొంగే ప్రదేశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఇటువంటి ప్రదేశాల్లో పోలీసు, వాలంటీర్లు లేదా ఇతరులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించాలని అన్నారు. గతంలో జరిగిన విపత్తుల పరిస్థితిని గ్రామాల్లో తెలుసుకుని పక్కా ప్రణాళికలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. గత అనుభవాల దృష్ట్యా అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రహదారులపై ఉన్న పెద్ద గతకల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అటువంటి చోట్ల నీరు నిల్వ ఉండకుండా చూదాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, స్లాబ్ లు పడిపోయే అవకాశం ఉన్న భవనాలు, మట్టి ఇళ్లలో ఉన్న వాటిని సురక్షిత భవనాల్లోకి మార్చాలని ఆయన ఆదేశించారు

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, AT VIJAYANAGARAM**
**S.O.P. 7/2024**

Between :
1. Smt. Pragada Danamma
2. Sri. Pragada Syamalarao
3. Smt. Konna Usha Rani .....Petitioners
And:
Nil .....Respondents

**1. The Petitioners are :**
**1.** Smt. Pragada Danamma, W/o. Ramarao (Late), D.No.7-46a, Rajulu Veedhi, Near Ramalayam, Bhogapuram, Vijayanagaram District, Andhra Pradesh-535216, Aadhaar No. 7606 0398 8951, Cell No. 8341784852.
**2.** Sri. Pragada Syamalarao, S/o. Ramarao (Late), D.No.7-46a, Rajulu Veedhi, Near Ramalayam, Bhogapuram, Vijayanagaram District, Andhra Pradesh-535216, Aadhaar No. 3666 5596 0188.
**3.** Smt.Konna Usharani, W/o. Rama Krishna, D.No. 30-73-1, Kalinga Street, Vadlapudi, Near Gandhi Bomma, Visakhapatnam-530046, Andhra. Pradesh, Aadhaar No. 27805646 4631.
**II. The respondent is :**
NIL

**GENERAL NOTICE**

ఇందు మూలంగా పై పిటిషనర్స్ 1 (తల్లి), 2 అతని సోదరుడు, 3 అతని సోదరి అయి ఉన్నారు. వారు S.O.P. 7/2024 ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దాఖలు చేసి యున్నారు. పై తెలిపిన పిటిషనర్లు మొదటి పిటిషనర్ యొక్క చిన్న కుమారుడు, 2, 3 యొక్క పిటిషనర్ల యొక్క సోదరుడు మరియు అవివాహితుడు అయిన (లేటు) అప్పలరాజు (ప్రగడ Points man గా, Salem Division, Southern Railway, Chennai నందు పని చేసేవాడు మరియు సదరు అప్పలరాజు ప్రగడ ఎటువంటి Intestate లేకుండా తేది.31-08-2023న మరణించినాడు. ఆ కారణంగా సదరు పైన తెల్పిన పిటిషనర్లు ముగ్గురు సదరు Southern Railway, Chennai వారిని (లేటు) అప్పలరాజు ప్రగడ యొక్క బెనిఫిట్స్ అయినటువంటి రూ.15,12,450/-లు కొరకు సంప్రదించగా, అందుకు వారు, వారసత్వపు సర్టిఫికెట్ తీసుకురమ్మని ఆదేశించి నారు. కావున పైన తెల్పిన S.O.P. 7/2024 ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విజయనగరంలో వున్నందున, **తేది. 04-11-2024 ఉదయం 10.30ని॥లకు** స్వయంగా గాని, మీ తరుపున న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలియజేసుకోవలెను. లేని పక్షంలో ఆక్షేపణలు ఏమీ లేవని నిర్ధారించుకుని, పైన తెల్పిన S.O.P. 7/2024 పరోక్షంగా తీర్మానించి శ్రీ కోర్టువారు తదుపరి చర్యలు తీసుకుందురు.

**P. KARUNA**
**AKULA VAMSI SANGEETH KUMAR**
**D. DANTESWARA RAO**
**A. CHANDRAHAS**
Advocates, Visakhapatnam
Cell: 7386833003, 9440826282